జిల్లా రెవెన్యూ అధికారిగా మధుసూదన్‌రావు




రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా కె.మధుసూదన్ రావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న సత్యనారాయణ రావుకు ఎక్కడా పోస్టింగ్ కేటాయించలేదు. ప్రభుత్వ కార్యదర్శి వద్ద రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా డీఆర్వోగా పనిచేస్తున్న మధుసూదన్‌రావుకు స్థానం కల్పించారు.

గడువులోగా రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన జేసీ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నిర్దేశిత గడువులోగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. స్థానిక తితిదే కల్యాణమండలంలో గురువారం ఆయన రెవెన్యూశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మదనపల్లె డివిజన్‌లోని 153 రెవెన్యూ గ్రామాల్లో 19,764 సర్వే నంబర్లలో పరిశీలించిన ఫ్రీహోల్డ్ డీకేటీ భూములకు సంబంధించి రద్దు చేసిన దస్త్రాలకు సంబంధించి కారణాలు తెలియజేస్తూ సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం త్వరితగతిన జరగాలని, సీఎం కార్యాలయానికి వెళ్లే అర్జీలను మూడు రోజుల్లో పరిష్కరించి నివేదిక ఇవ్వాలన్నారు. మొత్తం 243 హైకోర్టు కేసుల్లో 150 కేసులకు కౌంటర్ దాఖలు చేయగా, 93 పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీఎల్ఏ ఆదేశాల మేరకు మూడు జిల్లాల జేసీలను బృందంగా ఏర్పాటు చేసి రెవెన్యూ సంబంధిత సర్వీసులపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో జేసీ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్, డీఎస్వో రఘురాం, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కమనీయం... సీతారాముల కల్యాణం

శ్రీరాముడి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో గురువారం తితిదే ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల మధ్య సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. సుప్రభాత సేవ, అభిషేకాలు నిత్యసేవల అనంతరం విశేషాలంకరణలో ముస్తాబైన సీతారాములను మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో అధిరోహింపజేసి భక్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా కల్యాణం వైభవంగా జరిపించారు. కల్యాణోత్సవంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, తితిదే అధికారులు, అర్చకులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. **-న్యూస్‌టుడే, వాల్మీకిపురం**



దస్త్రాలు పరిశీలిస్తున్న రాజంపేట సబ్‌కలెక్టర్ నైదియాదేవి

ఏపీఐఐసీ భూములపై విచారణ

ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాజంపేట: రాజంపేట మండలం మన్నూరు, తాళ్లపాక రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏపీఐఐసీ పేరిట సాగిన భూదందాపై సమగ్ర విచారణకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి రాజంపేట తహసీల్దారు కార్యాలయంలో గురువారం దస్త్రాలను పరిశీలించారు. 'ఈనాడు' ప్రధాన సంచికలో ఈ నెల 21న 'పంచేశారు.. భోంచేశారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు దృష్టిసారించడంతోపాటు వివిధ రూపాల్లో ఫిర్యాదులందడంతో విచారణకు ఉపక్రమించారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం!

త్వరలో 'మన ఊరికి మన పోలీసు' కార్యక్రమం

ఈనాడుతో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



భావిపౌరుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం. వీటి మూలాలు గుర్తిస్తున్నాం. ప్రత్యేకించి విద్యాసంస్థలపై దృష్టిసారించి సరఫరా కాకుండా చర్యలు చేపట్టాం. ఉచిత ఇసుక విధానాన్ని సమగ్రంగా అమలు చేయడానికి పోలీసుశాఖ తరఫున ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. చట్టాన్ని చేతిలోకి తీసుకునేవారిని కఠినంగా అణచివేస్తాం. ఇటీవల రాయచోటిలో దుకాణాలపై జరిగిన దాడిని తీవ్రంగా పరిగణించాం. భూదందాలపై వచ్చే ఫిర్యాదులపై స్పందిస్తున్నాం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడేదిలేదు. - ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

- ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాయచోటి, పీలేరు గ్రామీణ

మత్తులోనే ప్రమాదం

గంజాయి మత్తులో పీలేరుకు చెందిన ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు రైలు ప్రమాదంలో మృతి చెందిన ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. వారిద్దరూ మత్తులోనే ప్రమాదం బారిన పడినట్లు విచారణలో తేలింది. జిల్లాలో గంజాయి సరఫరాదారులపై ఉక్కుపాదం మోపి అణచివేశాం. రాయచోటి, పీలేరు, మదనపల్లె, రాజంపేటలో గంజాయి తాగే యువత వివరాలు సేకరించాం. వారిపై నిఘా పెట్టి కట్టడి చేస్తాం. రాజంపేటలోని ఓ విద్యాసంస్థపై ప్రత్యేక దృష్టిసారించాం. యువత గంజాయి బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మందులు, చిల్లర దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేస్తున్నాం. మత్తు పదార్థాలు విక్రయించేవారిపై కఠిన చర్యలు చేపడతాం. ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలపై నిఘా ఉంచాలి. త్వరలోనే 'మన ఊరికి మన పోలీసు' కార్యక్రమం నిర్వహించనున్నాం.

ఇసుక తవ్వకాల్లో జాగ్రత్తలు

ఉచిత ఇసుక విధానం కింద రైల్వే, రహదారి వంతెనల సమీపంలో తవ్వకాలు జరపకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ఉచితమంటే నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరపాలని కాదు. తాగునీటి వనరుల సమీపంలో ఇసుక తవ్వకంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. సాగునీటి కాలువల వద్ద ఇసుక తవ్వే పక్షంలో కోతకు గురయ్యే అవకాశం ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తాం. అవసరమైన వినియోగదారులు మాత్రమే ఇసుక తీసుకెళ్లేవిధంగా అనుమతులు జారీ చేస్తాం.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోనివ్వం

ఇటీవల రాయచోటిలో దుకాణాలపై జరిగిన దాడులను తీవ్రంగా పరిగణించాం. పెట్టుబడులు పెట్టేవారిని, వ్యాపారాలు చేసుకునేవారిని అడ్డుకునే విధానాలను ఎట్టిపరిస్థితుల్లో సహించం. తక్కువ ధరలకు సేవలందించడానికి వచ్చిన సెలూన్లను అడ్డుకోవడం భావ్యం కాదు. నిందితులపై కేసులు నమోదు చేసి భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడకుండా హెచ్చరించాం. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. భూదందాలపై ఫిర్యాదులందుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఫిర్యాదులు తగ్గినప్పటికీ వచ్చే పక్షంలో న్యాయమైన వాటిని గుర్తించి పరిష్కరిస్తున్నాం.' అని ఎస్పీ వివరించారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు పరామర్శ

పీలేరులో రైల్వేట్రాక్‌పై మంగళవారం అర్ధరాత్రి గంజాయి తాగుతుండగా రైలు ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన నేపథ్యంలో వారి తల్లిదండ్రులను గురువారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పరామర్శించి వారి నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థులు గంజాయి మత్తుకు అలవాటుపడి రైలు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. పీలేరులో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉందని, ఇప్పటికే కొంతమందిని గుర్తించామన్నారు. గత 10 నెలల్లో నమోదైన కేసుల కంటే గడిచిన మూడు నెలల్లోనే అధికంగా కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించి గంజాయి అమ్ముతున్నట్లు పక్కాగా సమాచారం ఇస్తే అరికట్టడానికి వీలుంటుందని, మత్తుకు బానిసైన పిల్లల సమాచారమిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి కౌన్సెలింగ్ ఇప్పించి మానసిక వైద్య నిపుణుల వద్దకు పంపుతామని ఎస్పీ పేర్కొన్నారు. ఆయనవెంట సీఐ యుగంధర్, ఎస్.ఐ.బాలకృష్ణ తదితరులున్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ఠ ఏర్పాట్లు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వచ్చే నెల 10వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని వైఎస్ఆర్ బాధ్య కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ర్యాలీ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్, మేజర్ అమర్‌దీప్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అదితి సింగ్ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకంలో భాగంగా ఆర్మీలో ప్రవేశాలకు ఇప్పటికే రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సామర్థ్య పరీక్షలు నవంబరు 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారని చెప్పారు. దీనికి సంబంధించి కడప మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. గుడారాలు, బారికేడ్లు, విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్ల పనులు ఆరో తేదీలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం పలు అంశాలపై పునీత్‌కుమార్, మెడికల్ అధికారి మేజర్ అమర్‌దీప్ వివరించారు. అనంతరం కడప మున్సిపల్ స్టేడియాన్ని పరిశీలించారు.


'వైకాపా నిర్వాకంతో డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం'



మాట్లాడుతున్న డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చి గత వైకాపా ప్రభుత్వం రేషన్ డిపో డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు ఆరోపించారు. మదనపల్లెలో గురువారం జరిగిన జిల్లా రేషన్ డిపో డీలర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీలర్లతోనే సరకులు పంపిణీ చేయాలని, ఎండీయూ వ్యవస్థను రద్దుచేయాలని, గ్రామీణ ప్రాంత డీలర్లకు రూ.7,500, పట్టణప్రాంత డీలర్లకు రూ.10 వేలు గౌరవవేతనమివ్వాలని, కమీషన్‌ను రూ.150లకు పెంచాలని, డీలర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎండీయూలకు ఈనెలాఖరులోగా బిల్లుల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా డీలర్ల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.గోపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ ఇమామ్ ఖాసిమ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రషీద్‌బాషా, కోశాధికారిగా వి.సుధీర్‌బాబులను ఎన్నుకున్నారు. సమావేశంలో మదనపల్లె పట్టణ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

డీఈవోగా సుబ్రహ్మణ్యం



రాయచోటి, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారిగా కె.సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహించిన శివప్రకాష్‌రెడ్డి రాయచోటి డిప్యూటీ డీఈవోగా కొనసాగనున్నారు. ఆయన స్థానంలో రెగ్యులర్ డీఈవోగా కార్వేటినగరం డైట్‌లో సీనియర్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంను నియమించారు.

గుంజనేరుతో గుబులు!

- వరదలతో ముంపు భయం
- రక్షణగోడ నిర్మాణానికి వినతి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

శేషాచలం నుంచి ప్రవహించే గుంజనేరు రైల్వే కోడూరు మీదుగా వెళుతుంది. దీని పరివాహక ప్రాంతంలో నరసరాంపేట, పాతబజారు, గాండ్లవీధి, చిన్నలాలాపేట, ధర్మాపురం, గాంధీనగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ గుంజనేరుకు వరద ముప్పు పొంచి ఉండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



ఇటీవల నరసరాంపేట వద్ద గుంజనేటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

–న్యూస్‌టుడే, రైల్వేకోడూరు

2005, డిసెంబరులో వరదలకు అనేక నివాసాలు వరదలో కొట్టుకుపోవడంతో వందలాది మంది నిరాశ్రయులుగా మారారు. అప్పటి నుంచి గుంజనేరుకు రక్షణ గోడ నిర్మించాలని బాధితులు కోరుతున్నారు. అప్పటి నుంచి ఏటా వర్షాకాలంలో వరదలకు నివాసాలు కూలిపోవడం పరిపాటిగా మారుతోంది. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రక్షణ గోడ నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేసింది. అనంతరం వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతిపాదన అటకెక్కింది. 2020-21 మధ్య కాలంలో గత వైకాపా ప్రభుత్వం రూ.38 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ఆదేశాలిచ్చింది. 2021, నవంబరులో వచ్చిన వరదల్లోనూ ఇక్కడ నాలుగు నివాసాలు కొట్టుకుపోయాయి. పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నా రక్షణ గోడ నిర్మాణ పనులు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం.

వానొస్తే వణుకే



గత 25 ఏళ్లుగా గుంజనేరుకు రక్షణ గోడ నిర్మించాలని అధికారులను కోరుతున్నాం. వర్షం వచ్చిందంటే ఎప్పుడు ఏరు పొంగుతుందోనని రాత్రి వేళల్లో నిద్రమానుకుని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. ప్రభుత్వాలు మారినప్పుడల్లా నిధులు కేటాయిస్తున్నారు తప్పితే పనులు మాత్రం చేపట్టడం లేదు.

- ఎల్. యానాదయ్య, నరసరాంపేట

తక్షణం చొరవ చూపాలి



ఏళ్ల కిందట ఇక్కడ స్థిరపడ్డాం. మూడేళ్ల కిందట వచ్చిన వరదల్లో మా ఇల్లు కొట్టుకుపోయింది. కనీసం నష్టపరిహారం అందలేదు. అప్పటి నుంచి చాలా మంది అద్దె ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. రక్షణ గోడ కట్టిస్తే వరదల నుంచి రక్షణ కలుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగితే మేలు.

- షేక్ ఖాజాబీ, నరసరాంపేట

ప్రభుత్వానికి నివేదిస్తాం

గత ప్రభుత్వం గుంజనేరు రక్షణ గోడ నిర్మాణానికి రూ.38 కోట్లు కేటాయించింది. ప్రభుత్వం మారడంతో ఆ దస్త్రం ముందుకు కదల్లేదు. విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు మంజూరైతే వచ్చే వేసవిలో నిర్మాణ పనులు చేపడతాం.

-చెంగలరాయుడు, డీఈ, నీటిపారుదలశాఖ


ప్రేమ పేరిట యువకుడి వంచన!

- ఇంటర్ విద్యార్థినిని గర్భవతిని చేసి మోసం
- నిందితుడిపై పోలీసులు పోక్సోకేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, కురబలకోట, న్యూస్‌టుడే : ప్రేమ పేరిట ఓ బాలికను యువకుడు మోసం చేసి గర్భవతిని చేసిన ఘటన కురబలకోట మండలంలో గురువారం వెలుగు చూసింది. ముదివేడు ఎస్.ఐ. దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...కురబలకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (16) మదనపల్లెలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. బాలిక నివాసముంటున్న ఇంటి పక్కనే ఉండే వ్యక్తులకు బంధువైన లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేటకు చెందిన ఖాదర్‌బాషా (24) తరచూ కురబలకోటకు వచ్చి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ప్రేమిస్తున్నానని బాలికను నమ్మించడంతో అతడితో ప్రేమాయణం సాగించింది. ఇదే అదునుగా ఖాదర్‌బాషా గర్భవతిని చేశాడు. తనను వివాహం చేసుకోవాలని ఆమె కోరగా అతడు ముఖం చాటేశాడు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు బాలికను వైద్య పరీక్షలకు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆరు నెలల గర్భిణిగా నిర్ధారించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఖాదర్‌బాషాపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. తెలిపారు. బాలిక పక్కింట్లో ఉన్నవారి సహకారంతోనే నిందితుడు ఈ పని చేశాడని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండు చేశారు. కేసును మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు విచారణ చేస్తున్నారు.

ప్రాణదాత చంద్రబాబును కలిసిన చిన్నారి కుటుంబం

ములకలచెరువు, న్యూస్‌టుడే: బిడ్డను బతికించుకోలేం కనీసం చంపుకోవడానికైనా అనుమతివ్వండి అంటూ 9 ఏళ్ల క్రితం ఓ చిన్నారి తల్లిదండ్రులు అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను కోర్టును ఆశ్రయించడంతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా చిన్నారి జీవితంలో వెలుగులు నింపారు. ములకలచెరువు మండలం, దేవురిపేట పంచాయతీ, ఆర్‌ఎస్‌.కొత్తపల్లికి చెందిన రమణప్ప, సరస్వతి దంపతులకు కుమార్తె జ్ఞానసాయి 2015లో జన్మించింది. చిన్నారి కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండంతో 2016 జూన్‌లో తమ బిడ్డను చంపుకోవడానికి అనుమతివ్వాలని కోర్టును ఆశ్రయించారు. ఈ మేటర్ అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించడంతో అప్పటి సీఎం చంద్రబాబు చిన్నారి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని హామీ ఇచ్చారు. చిన్నారికి సుమారు రూ.35 లక్షల ఖర్చు చేసి 2016 ఆగస్టులో శస్త్రచికిత్స చేశారు. దీంతో చిన్నారి ఆరోగ్యం కుదుటపడింది. 9 సంవత్సరాల తర్వాత మళ్లీ తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జ్ఞానసాయి కుటుంబ సభ్యులు బుధవారం సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిన్నారి జ్ఞానసాయి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని తెదేపా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.




సీఎం చంద్రబాబుతో జ్ఞానసాయి కుటుంబ సభ్యులు

ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భేటీ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. తన కుమారుడు జునైద్ అక్బరీని ముఖ్యమంత్రికి పరిచయం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీశాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ కూడా ఉన్నారు.

సీఎం సహాయనిధికి రూ.లక్ష ఆర్థిక సాయం

పీలేరు, న్యూస్‌టుడే: కాపు బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెలగపూడిలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసి సీఎం సహాయనిధికి రూ.లక్ష విరాళ చెక్కును అందజేసినట్లు నాయకులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కాపు నాయకులు కాపు ఉపాధ్యాయ భవన్ నిర్మాణానికి అమరావతిలో కొనుగోలు పద్ధతిలో స్థలాన్ని ఇవ్వాలని సదరు భవనాన్ని నిర్మించి కాపు, బలిజ, ఒంటరి కులాల విద్యార్థుల భవిష్యత్తుకు నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎంకు విన్నవించారు. కాపు బలిజ ఒంటరి తెగల విద్యార్థుల భవిష్యత్తు కోసం గతంలో అమలు చేసిన ఈబీసీ విద్యా శాతం కోటాను పునరుద్ధరించాలని కోరారు. కాపు బలిజ ఉప కులాలలోని విద్యార్థులకు వారి తండ్రి రికార్డుల పరంగా కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా పెరిక బలిజ వంటి ఉపకులాల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. సీఎంను కాపు సంక్షేమ సంఘం నాయకులు ఫణీంద్ర, చెన్నకేశవులు, లీలా మాధవరావు, పోతంశెట్టి రమేష్ కలిశారు.



సీఎం చంద్రబాబుకు ఆర్థికసాయం అందజేస్తున్న రమేష్, నాయకులు

ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టరుకు ఫిర్యాదు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని తరిగొండ రామానాయుడు చెరువు, మర్రిపాడు హరిహరరాయల చెరువుల్లో అక్రమంగా ఇసుక తరలింపుపై తెదేపా నేతలు గురువారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. కొందరు మాజీ వాలంటీర్లు, నేతలు కలిసి ట్రాక్టరుకు రూ.300లు వసూలు చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు. ఉచిత ఇసుకకు సొమ్ము ఎందుకు చెల్లించాలని తెదేపా నేతలు నిలదీస్తున్నారు. వాల్మీకిపురం మండలానికి చెందిన కొందరు వైకాపా కార్యకర్తలు మదనపల్లెకు ఇసుక తరలిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోలేదని వారు పేర్కొన్నారు.

రెవెన్యూ అతిథిగృహం పరిశీలించిన అధికారులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లోని రెవెన్యూ అతిథి గృహాన్ని గురువారం మదనపల్లె ర.భశాఖ ఈఈ అరవిందా దేవి, డీఈ సూర్యనారాయణలు పరిశీలించారు. గత ఏడాది ఈ అతిథి గృహాన్ని ఆధునికీకరించే పనులను చేపట్టి అర్ధాంతరంగా ఆపేసిన విషయం తెలిసిందే. ఈ పనులను పూర్తి చేయడానికి అంచనాలను సిద్ధం చేయాలని కలెక్టర్ తాజాగా ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈఈ, డీఈలు అసంపూర్తిగా ఉన్న భవనాన్ని చూసి తదుపరి చేపట్టవలసిన పనులపై అధ్యయనం చేశారు.

ప్రజాదర్బార్‌తో సమస్యలకు సత్వర పరిష్కారం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : తెదేపా కేంద్ర కార్యాలయంలో చేపట్టిన ప్రజా దర్బార్‌తో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు తెలిపారు. గురువారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్, నూకసాని బాలాజీ, నరసింహ ప్రసాద్‌లతో కలసి ఆయన వినతులు స్వీకరించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పేరుకు పోయిన ఎన్నో సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబుపై భరోసాతో వందలాది మంది విచ్చేస్తున్నారని చినబాబు తెలిపారు.



తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు

ఉప విద్యాశాఖ అధికారిగా కేవీఎన్ కుమార్



మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె ఉప విద్యాశాఖ అధికారిగా కేవీఎన్ కుమార్ నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను మదనపల్లె డీవైఈఓగా, తిరుపతి ఎఫ్ఏసీ డీఈవోగా నియమించారు. మదనపల్లెలో డీవైఈఓగా పనిచేస్తున్న శ్రీరామ పురుషోత్తంను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా నియమిస్తూ బాపట్ల డీఈఓగా నియమించారు.

రైతులకు యాంత్రీకరణ భాగ్యం!

- రాయితీపై పరికరాలివ్వాలని నిర్ణయం
- వ్యవసాయశాఖాధికారుల ప్రతిపాదన
- ఎన్డీయే సర్కారుపై చిగురించిన ఆశలు

-న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

వ్యవసాయ రంగంలో కూలీల కొరత వెంటాడుతోంది. యంత్ర పరికరాల వినియోగం అనివార్యమైంది. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో ముద్దుకుడుకులకు పెద్దపీట వేశారు. సన్నిహితుల్కే యంత్ర పరికరాలు మంజూరు చేశారు. సన్న, చిన్నకారు రైతులకు అరకొరలో వైరిరం చూపారు. కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా నిరాశే మిగిలింది. కర్షకుల కన్నీటి వెతలను జగన్ సర్కార్ జమానా ఎవరూ ఆలకించలేదు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతలకు వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలివ్వాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏఏ రకాలు కావాలో సమాచారం సేకరించి నివేదించాలని జిల్లాల ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

జిల్లాలో రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో 17 రకాల 12,423 యంత్ర పరికరాలు రాయితీపై ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఉన్నతి సంఘాలు, బృంద సభ్యులు, వ్యక్తిగతంగా మంజూరు చేయాలని కసరత్తు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతుల కన్నీటి ఘోషను పట్టించుకోలేదు. కర్షకులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదు. నేలలో లోతు దుక్కులు, విత్తనం, ఎరువులు చల్లడానికి అనువైన గొర్రులు, కలుపుతీత, సేద్యం పనులు చేయడానికి కావాల్సిన ట్రాక్టర్లు మంజూరు చేయాలని వేడుకున్నా ఆలకించే నాథుడే లేదు. తొలి రెండేళ్లు రిక్త హస్తం చూపారు. చివర్లో రైతు భరోసా కేంద్రాల్లో యంత్రపరికరాలను అందుబాటులో పెట్టి తక్కువ ధరలకు అద్దె చెల్లించి వినియోగించుకోవాలని అద్దె కేంద్రాలను ఏర్పాటు చేయించారు. రైతు గ్రూపులకు మాత్రమే అధిక మొత్తంలో సబ్సిడీతో వినియోగదారుల సంఘాల పేరిట వైకాపా విధేయులకు పంచేశారు. సాధారణ రైతులకు మాత్రం నిరాశే ఎదురైంది.

★ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో మునుపటిలా రైతులకు యంత్ర పరికరాలు కల్పించాలని ముందుకొచ్చారు. ప్రాధాన్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు అందజేయాలని ఉన్నత స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. భూమిలో విత్తనం వేసిన అనంతరం చిరు మొలక నుంచి కోత వరకు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పురుగులు దాడి చేస్తున్నాయి. అన్నదాతల ఆశల పంటను నమిలి మింగేస్తున్నాయి.



బహుళ పంటల నూర్పిడి యంత్రాలు

బీడల అదుపు చేయడంలో కీలకమైన చేతి, కాలితో తొక్కే, తైవాన్, పవర్, బ్యాటరీ వాడే స్ప్రేయర్లను ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది.

★ నేలను గుల్ల చేయడానికి వినియోగించే రోటావేటర్లు ఇవ్వనున్నారు. దుక్కి, పనులకు కావాల్సిన 5, 7, 9 మడకల గొర్రులు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. త్వరలో ఉన్నత స్థాయి నుంచి మార్గదర్శకాలు రాగానే మంజూరు చేయాలని నిర్ణయించారు. వరి కోత, బహుళ పంటల నూర్పిడి యంత్రాలు, చిన్న ట్రాక్టర్లు, గడ్డిని కట్టలు కట్టడానికి, గ్రాసం కత్తిరింపు, రోటావేటర్లు, కలుపుతీత పరికరాలు రాయితీపై ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. త్వరలో అనుమతి రానున్నట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. ఆయిల్ అనంతరం వ్యక్తిగతంగా రాయితీపై ఆధునాతన యంత్ర పరికరాలు రానున్నాయని తెలుసుకుని కర్షకుల మోము మురిసిపోతోంది. కూలీల కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుందని, సేద్యం పనులు శరవేగంగా ముందుకు సాగుతాయని ఆశావాదంతో ఉన్నారు.

జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనలు

రకం	యంత్ర పరికరాలు
వరిగడ్డి కట్టలు కట్టడానికి	28
వేరుసెనగ కాయల తీత	50
కోనోవీడర్లు	75
డ్రమ్ సీడర్లు	100
బహుళ పంటల నూర్పిడి	150
ట్రాక్టరు స్ప్రేయర్లు	240
ఛాఫ్ కట్టర్లు	350
ట్రాక్టర్లు	400
చిన్న ట్రాక్టర్లు	450
పవర్ టిల్లర్లు	480
ఎరువులు జల్లే గొర్రు	650
పవర్ వీడర్లు	750
రోటావేటర్లు	1,200
5, 7 మడకల గొర్రులు	1,500
9 మడకల గొర్రులు	1,500
చేతి, బ్యాటరీ స్ప్రేయర్లు	2,000
తైవాన్, పవర్ స్ప్రేయర్లు	2,500

అనుమతి రాగానే మంజూరు చేస్తాం

జిల్లాలో వ్యవసాయం చేస్తున్న రైతులకు కావాల్సిన 17 రకాల యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన కర్షకులకు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- చంద్రానాయక్, డీఏవో

గ్రామసభల్లో వినతుల పరిష్కారంపై దృష్టి

జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామసభల్లో వివిధ సమస్యలపై వచ్చిన వినతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి చర్యలు తీసుకోవాలని సర్వేయర్లను జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఇందుకు మునుపు మదనపల్లె మండలానికి సంబంధించి సర్వే రికార్డులను పరిశీలించారు. బీకే పల్లెలో అత్యధికంగా 92 మంది భూ సర్వేకు చలానాలు చెల్లిస్తే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే పరిష్కరించాలన్నారు. రీసర్వేకు సంబంధించి గ్రామాల్లో జరుగుతున్న సభలకు ఖచ్చితంగా మండల, గ్రామ సర్వేయర్లు హాజరుకావాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలించాలన్నారు. సర్వేపరమైన భూ కొలతలకు సంబంధించి అవగాహన కల్పించుకుని, రెవెన్యూ దస్త్రాలు, సర్వే రాళ్లను పూర్తిస్థాయిలో పరిశీలించి సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే సర్వే నిమిత్తం చలానాలు చెల్లించిన వారి భూములను వెంటనే సర్వే చేయాలని చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సచివాలయం స్థాయిలో సర్వేయర్లు ఉన్నప్పటికీ ఇలా సర్వే దరఖాస్తులను పూర్తి చేయకపోవడం శోచనీయమని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, డివిజన్‌లోని మండల సర్వేయర్లు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అధికారి భరత్‌కుమార్

కార్యకర్తల జోలికొస్తే ఎవరినైనా వదిలిపెట్టం

తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే ఎవరినైనా వదిలేది లేదని జిల్లా తెదేపా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు, తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి హెచ్చరించారు. తంబళ్లపల్లె మండలం, కన్నెమడుగు పంచాయతీ, కె.రామిగానిపల్లికు చెందిన గోపాలకృష్ణ ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా గోపాలకృష్ణ ప్రతిఘటించడంతో దాడికి పాల్పడ్డారు. గాయపడి తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌కృష్ణను గురువారం జిల్లా తెదేపా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు, జయచంద్రారెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బి.కొత్తకోట మండలం, పెద్దపల్లికి చెందిన రాజశేఖర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతన్ని పరామర్శించారు. నియోజకవర్గ సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, నాయకులు పాల్గొన్నారు.

★ తెదేపా సభ్యత్వ నమోదులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా తెదేపా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు అన్నారు. గురువారం తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. సభ్యత్వ నమోదుతో ప్రమాద బీమాతో పాటు ఇతర సౌకర్యాలు కలుగుతాయన్నారు. జిల్లాలో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల్లో తెదేపా కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని కోరారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడు, పారిశ్రామికవేత్త గిరిధర్‌రెడ్డి, నాయకులు సురేష్, రామాంజులు, కేవీ రమణ, విశ్వనాథ్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



గోపాలకృష్ణను పరామర్శిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు, తెదేపా నేత జయచంద్రారెడ్డి, నాయకులు

రైతులు సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయశాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై

కలకడ, న్యూస్‌టుడే : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సంయుక్త సంచాలకులు డాక్టర్ గుణశేఖర్ పిళ్లై అన్నారు. మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని గోపాలపురంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గొర్రెలకు నట్టల నివారణ మందును తాపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో పశుపోషకులు తీసుకోవాల్సి జాగ్రత్తలను తెలిపారు. 25 నుంచి అఖిల భారత పశు గణన జరుగుతుందని, పశువైద్య సిబ్బంది ఇంటింటికి వస్తారని, రైతులు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణయ్య, పశువైద్యాధికారులు తేజ్‌కల్యాణ్, పూర్ణిమ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గొర్రెలకు నట్టల నివారణ మందు తాపుతున్న జేడీ గుణశేఖర్‌పిళ్లై

మేకలు, గొర్రెలతో ఆర్థిక ఆసరా...

మదనపల్లె అర్బన్ : గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండటంతోనే రైతు జీవనోపాధికి ఆసరాగా ఉండగలవని, అందువల్ల వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ కే.సత్యనారాయణ సూచించారు. నట్టల నివారణోత్సవాల్లో భాగంగా చీకలబైలు పంచాయతీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గొర్రెలు, మేకలకు నట్టల మందు వేసే అంశాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెల పెంపకం వల్ల ప్రతి రైతు కుటుంబ ఆర్థిక పరిస్థితి క్రమేణా మెరుగుపడుతుందని, అందువల్ల రైతులు గొర్రెల పెంపకాన్ని చేపట్టి, ఆర్థికంగా బలపడాలని, అంతేగాక వాటి ఆరోగ్యాన్ని సైతం బాగు పరచేందుకు నిరంతరం శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో మదనపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి, సీటీఎం వైద్యులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది మల్లికార్జున, సర్పంచి ఎం.ప్రభాకర్, పలువురు తెదేపా శ్రేణులు పాల్గొన్నాయి.

తల్లికి వందనం విడుదల చేయాలని ఆందోళన

డీవైఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే తల్లికి వందనం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున అన్నారు. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మదనపల్లె డీవైఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఎన్నికల సమయంలో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని నాలుగు నెలలు గడుస్తున్నా ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ నెల 23న జరిగిన మండలి సమావేశంలో తల్లికి వందనం ఎప్పుడు ఇస్తామని ప్రకటించకుండా ముగించడం దారుణమన్నారు. హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇవ్వకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం డీవైఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి, మదనపల్లె నగర అధ్యక్షుడు విజయ్, నగర కార్యదర్శి కిషోర్‌కుమార్, గణేష్, మోహన్‌రాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

జేఎన్‌టీయూ చదరంగం పోటీలకు విద్యార్థిని ఎంపిక

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : మిట్స్ కళాశాలలో సీఎస్ఈ రెండో ఏడాది డేటా సైన్స్‌కు చెందిన విద్యార్థిని ఎం.నాగేశ్వరి జేఎన్‌టీయూ చదరంగం పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జేఎన్‌టీయూలోని అనంతపురానికి చెందిన బృందానికి ఈ విద్యార్థిని ప్రాతినిధ్యం వహిస్తారని, ఈ ఎంపిక నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిందని తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 5 నుంచి 8వ తేదీ వరకు విశాఖలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల చదరంగం పోటీలో విద్యార్థిని పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదెళ్ల విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



విద్యార్థిని నాగేశ్వరితో కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్, వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, అధ్యాపకులు

క్రీడా పోటీల్లో సత్తా...

మదనపల్లె విద్య : తిరుపతి ఎస్వీయూలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో మదనపల్లెలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన హాకీ పోటీల్లో కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచి బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఈ సందర్భంగా హాకీ, షటిల్ బ్యాడ్మింటన్ విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ రమాదేవి, పీడీ శరత్‌నాయక్‌లు అభినందించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు అడ్డుకట్ట

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె రెవెన్యూగ్రామ పరిధిలోని సర్వేనంబరు 329లోకి ఎవరూ ప్రవేశించకుండా తహసీల్దారు మహమ్మద్ అన్సారీ ఆంక్షలు విధించారు. ఈ భూమిలోకి అనుమతి లేకుండా ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరిస్తూ గురువారం బోర్డును ఏర్పాటు చేయించారు. స్థానికులు ఎదుర్లగుట్టగా పిలుస్తున్న ఈ ప్రాంతాన్ని ఇటీవల కొందరు చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు అందిన సమాచారంతో రంగంలోకి దిగిన రెవెన్యూ సిబ్బంది సర్వే చేశారు. ఎదుర్లగుట్ట ప్రభుత్వ భూమిగా గుర్తించారు. తాజాగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు ఈ భూమిపై వీఆర్ఏలు నిఘా పెట్టాలని తహసీల్దారు సూచించారు.



బయ్యప్పగారిపల్లెలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పీవీసీ ఉన్నత పాఠశాలతో పాటు బాలికోన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజన నిర్వాహకులను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ... ప్రస్తుతం అందిస్తున్న భోజన నాణ్యత కంటే రాబోవు రోజుల్లో విద్యార్థులకు మరింత నాణ్యంగా భోజనాన్ని అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సావిత్రి, శ్రీదేవి, ఏజీపీ అశోక్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద కుమార్, మండల న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, న్యాయవాదులు, పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న జడ్జి గురుఅరవింద్

ఆడిటర్లను విచారించిన డీడీ

చిత్తూరు, న్యూస్‌టుడే : అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నలుగురు ఆడిట్ అధికారులను ఆడిట్ శాఖ కర్నూలు రీజియన్ డిప్యూటీ డైరెక్టర్(ఆర్‌డీడీ) గోవిందప్ప గురువారం విచారించారు. 'ఈనాడు'లో 'పైరవీలకే ప్రాధాన్యం, విచారణల తీవ్ర జాప్యం' శీర్షికన కథనం ఆగస్టు ఆరో తేదీన ప్రచురితమైంది. దీనిపై ఆడిట్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. తొలుతగా ఆగస్టు ఏడో తేదీన ఆర్‌డీడీ విచారించారు. మళ్లీ రెండోసారి స్థానిక రిలీఫ్ ఆడిట్‌శాఖ అధికారి కార్యాలయంలో నలుగురు ఆడిట్ అధికారులను విచారించారు. మదనపల్లె బీటీ కళాశాలలో 2022లో అసిస్టెంట్ ఆడిట్ అధికారి (ఏఏవో) శ్రీనివాసులురెడ్డి, సీనియర్ ఆడిటర్లు ధరణీకుమార్, వరలక్ష్మి, ప్రమీల ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని కళాశాల ప్రిన్సిపల్ రాష్ట్ర ఆడిట్ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లోనే అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదించాలని కర్నూలు ఆర్‌డీడీని ఆదేశించారు. ఈ క్రమంలో నలుగురు ఆడిట్ అధికారులను విచారించారు. విచారణకు సంబంధించి సమగ్ర వివరాలను త్వరలో రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదించనున్నామని గోవిందప్ప తెలిపారు. రిలీఫ్ ఆడిట్ విభాగం జిల్లా ఆడిట్ అధికారి పూర్ణిమ, ఏఏవో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పింఛలోకి 220 క్యూసెక్కుల ప్రవాహం

సుండుపల్లి, న్యూస్‌టుడే : వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలోకి గురువారం 220 క్యూసెక్కుల నీరు చేరిందని ఏఈ నాగేంద్రనాయక్ తెలిపారు. గురువారం సాయంత్రానికి జలాశయంలో 985.2 అడుగుల మేర నీటిమట్టం ఉందన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కలికిరిగ్రామీణ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ద్విచక్ర వాహనదారుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రఫీ తెలిపారు. చిత్తూరు జిల్లా సోమల మండలం టి.చెరకువారిపల్లెకు చెందిన కోటగుండ్ల కృష్ణయ్య (30) బుధవారం రాత్రి కలకడ నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా గుండ్లూరు సమీపంలో ఎదురుగా అతి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రుడిని పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పోలియో చుక్కలు తప్పనిసరి

చింతపర్తి (వాల్మీకిపురం): 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు, టీకాలు వేయించాలని వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. చింతపర్తి పీహెచ్‌సీ ఆసుపత్రిలో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకు మునుపు పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి జులేఖ, హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది ఇంద్రాణి, మహమ్మద్ రఫీ, సుధాకర్, భానుబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కలకడ, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సుమిత్ర, పీఈటీ రేవంత్ కుమార్ గురువారం తెలిపారు. ఇటీవల చిత్తూరులో జరిగిన అండర్-17 విభాగం పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నవంబరు 2, 3 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగే పోటీల్లో రేస్‌వాక్, రన్నింగ్ రేస్, హర్డిల్స్‌లో పాల్గొంటారని తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీఈటీ

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

రామసముద్రం, న్యూస్‌టుడే: శ్మశానం ఆక్రమణపై గొల్లపల్లె దళితవాడ గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మూగవాడి గ్రామ పంచాయతీ గొల్లపల్లె దళితవాడకు మినికి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 259లో ఎకరం ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. కొంత కాలంగా అందులో శవాలను పూడుస్తున్నారు. అయితే ప్రస్తుతం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శ్మశాన స్థలాన్ని ఆక్రమించి సాగుకు ఉపక్రమించాడు. అడ్డుకునేందుకు గ్రామస్థులు యత్నించి విఫలం కావడంతో న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. శ్మశాన స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణను నిర్మూలించాలని కోరారు. ఆక్రమణ నిర్మూలనకు తగు చర్యలు తీసుకోనున్నట్లు రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.



ఆక్రమణకు గురైన శ్మశాన స్థలం ఇదే

బసినికొండ... సమస్యల అనకొండ

కాలువల్లేక స్థానికుల అవస్థలు

అయిదేళ్లు పట్టించుకోని గత వైకాపా సర్కారు

బసినికొండ (మదనపల్లె గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని బసినికొండ పంచాయతీ పరిధిలో, ఇటు పురపాలక సంఘం పరిధిలో విస్తరించింది. ఇక్కడ దాదాపు 10 వేలకుపైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ప్రధాన మార్గాల్లో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి, హోటళ్లు, దుకాణాల నుంచి వెలువడే మురుగంతా రహదారిపై ప్రవహిస్తోంది. నిమ్మనపల్లె రోడ్డు, పుంగనూరు రోడ్డులోని పురపాలక సంఘం బోర్డుకు సమీపంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఇరుప్రాంతాల నుంచి వచ్చే చెత్త చెదారాన్ని, దుకాణాల నుంచి వ్యర్థాలను తీసుకొచ్చి శ్మశానవాటిక ప్రహరీ వద్ద గుట్టగా వేస్తున్నారు. నెలల తరబడి వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. కొండ నుంచి వర్షపు నీరు ఊరి రోడ్డుపైకి మురుగుగా ప్రవహిస్తోంది. పుంగనూరు రోడ్డు నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో కాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. వడ్డిపల్లె నుంచి దిగువకు మురుగు, వర్షపు నీరు ప్రవహిస్తోంది. పుంగనూరు రోడ్డు మీదుగా బసినికొండ పంచాయతీ సచివాలయం ముందు మురుగు నీటిలో దుర్వాసన వెదజల్లుతోంది.



బసినికొండ మెకానిక్ షెడ్ల వీధిలో హంద్రీ-నీవా ఊటనీరు



నిమ్మనపల్లె రోడ్డులో పేరుకున్న చెత్తదిబ్బలు

మెకానిక్ షెడ్ల మధ్య ఊట నీరు

మాదినికొండ సమీపంలో వెళ్లే హంద్రీ-నీవా కాలువలోకి కొండల నుంచి వర్షపునీరు చేరింది. ఈ కాలువ నుంచి ఊటనీరు మదనపల్లె పట్టణంలోకి వస్తున్నాయి. దీంతో బసినికొండలోని మెకానిక్ షెడ్లలోకి, రోడ్లపైకి నీరు ప్రవహిస్తూ బురదగా మారింది. వాహనాల రాకపోకలతో ఈ ప్రాంతాలు అధ్వానంగా మారాయి. కనీసం నడవాలంటే కూడా ఇబ్బందిగా మారింది. షెడ్లల్లో పనిచేయలేక కార్మికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నీరు పుంగనూరు రోడ్డు మీదుగా పట్టణంలోని డీఎస్పీ బంగ్లా వరకు విస్తరించింది. లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉందని, పనులు మంజూరయ్యాయని, కాలువ నిర్మాణాలు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హంద్రీ-నీవా ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

కొండవంకలో చెత్తచెదారం

బసినికొండ పంచాయతీ పరిధిలోని కొండ కింద నుంచి పాములచెరువు వరకు కాలువ విస్తరించి ఉంది. బసినికొండ కాలనీ సమీపంలోని ఈ వంక పూర్తిగా పూడిపోయింది. చెత్త దిబ్బలు, ప్లాస్టిక్‌తో నిండిపోయింది. ఇళ్ల నుంచి వచ్చే మురుగు కాలువలు ఇందులోకి ప్రవహిస్తున్నాయి. పూడిక తీయకపోవడంతో మురుగుతో పాటు, వర్షపు నీరు కూడా ప్రవహించడం లేదు.

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: మండలంలోని రంగారెడ్డికాలనీలో ఇటీవల కురిసిన వర్షానికి వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో పాములు, కుక్కలతో భయాందోళనగా మారింది? **- ఈశ్వర్‌ప్రసాద్, రంగారెడ్డికాలనీ**

✓: మరమ్మతులు చేపట్టి, వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

?: కొత్తిండ్లు పంచాయతీ భవానినగర్‌లో ఇటీవల కురిసిన వర్షం కారణంగా ఇళ్ల మధ్యలో, రోడ్డుపై వర్షపునీరు నిలబడిపోయింది. ఇంట్లో నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందిగా ఉంది? **- షఫీవుల్లా, కొత్తిండ్లు**

✓: వర్షపు నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య కార్మికులతో తాత్కాలిక కాలువ ఏర్పాటు చేస్తాం. **- శ్వేత, కార్యదర్శి, కొత్తిండ్లు, మదనపల్లె**

?: బాబుకాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల రోడ్డు పురపాలక సంఘం బోర్డు వద్ద చెత్తచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. కాలువల్లో చెత్తదిబ్బలు నిండిపోయి కాలువలో మురుగు ప్రవహించడం లేదు? **- రమణమ్మ, బాబుకాలనీ**

✓: పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

- న్యూస్‌టుడే, పెద్దతిప్పసముద్రం

?: మండలంలోని నవాబుకోట పంచాయతీ, వరికసువుపల్లిలో నెల రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులకు తెలియజేసిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదు? **- వెంకటరమణ, స్థానికుడు**

✓: పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారం రోజుల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- యోగానంద, ఈఓపీఆర్డీ**

- న్యూస్‌టుడే, కంభంవారిపల్లి

?: మండలంలోని గర్నిమిట్టలో తాగునీటి ట్యాంకు వద్ద పిచ్చి మొక్కలు తొలగించాలి. పారిశుద్ధ్యం లోపించి దోమలు వృద్ధి చెందుతున్నాయి? **- రాజశేఖర, స్థానికుడు**

✓: పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- గపూర్, ఈవోపీఆర్డీ, కంభంవారిపల్లె**

ఆటో ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

రామసముద్రం, న్యూస్‌టుడే: ఆటో ఢీకొని దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తూరు మలుపులో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. మినికి గ్రామ పంచాయతీ గుంతవారిపల్లె గ్రామానికి చెందిన దంపతులు గోవిందరెడ్డి, లీలావతమ్మ ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వెళ్తున్నారు. పుంగనూరు వైపు నుంచి వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు

కలకడ, న్యూస్‌టుడే : అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సైబర్ నేరాలు అరికట్టడంతో యువత పాత్రపై పోలీసులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం అమరులైన పోలీసులపై సీఐ గురునాథ మాట్లాడారు. సైబర్ నేరాలబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్.ఐ రామాంజనేయులు, ప్రిన్సిపల్ జయభారతి, వైస్ ప్రిన్సిపల్ రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి పుష్పకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ: పీలేరు పాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్.ఐ. బాలకృష్ణ తెలిపారు. ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, సీఆర్పీ మురళీధర్‌రావు పాల్గొన్నారు.



కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సీఐ, ఎస్.ఐ.లు

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో పాఠశాల ప్రిన్సిపల్ సాబ్‌జాన్, విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం మదనపల్లె పట్టణంలోని సురేంద్రరెడ్డి రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన జి.పూజ (9వ తరగతి), ఆర్.ధన్యశ్రీ (10వ తరగతి), వి.దీపిక (8వ తరగతి)లకు ప్రిన్సిపల్ సాబ్‌జాన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ మంత్రి దృష్టికి సమస్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ సచివాలయంలో కలిసి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు నరేంద్రబాబు మాదిగ తెలిపారు.



రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో నరేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు

పరిశుభ్రతపై దృష్టి సారించండి

పీలేరు గ్రామీణ: పీలేరు పరిధిలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమ్మతేజ డిమాండ్ చేశారు. గురువారం పీలేరు ఈవో గురుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పరిశీలించి వసతి గృహాలు, గురుకులాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆయన విన్నవించారు. సాయి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మదనపల్లె బీసీ, ఎస్సీ వసతి గృహాల సంరక్షకులు వెంకటేష్, రంగప్రసాద్, మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏఆర్ సురేష్ అన్నారు. గురువారం పట్టణంలోని నక్కలదిన్నె వద్ద బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల ఆవరణల్లో నెహ్రూ యువకేంద్రం, మదనపల్లె యూత్ కరాటే క్లబ్ సంయుక్తాధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఒక చెట్టు నాటి దానిని సంరక్షిస్తే స్వచ్ఛమైన గాలిని అందిస్తుందన్నారు. దాని ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రతి ఒక్కరు తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి పెద్ద చేయడంతో పాటు తల్లిపై చూపే ప్రేమను చెట్టుపై చూపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డీఎం అభినయ్‌కాంత్, క్షయ విభాగం సూపర్‌వైజర్ ప్రభాకర్, బ్లాక్ బెల్ట్ విద్యార్థులు మహేశ్వర్, ముహిబుల్ రెహ్మాన్, కాలేషా మస్తాన్, మహమ్మద్ ఉమ్మర్, లాస్య, తనుష్‌కుమార్‌రెడ్డి, జైత్ర మాదుర్, తేజిత్, వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.



బీసీ వసతి గృహ ఆవరణలో మొక్కలు నాటుతున్న మదనపల్లె యూత్ కరాటే క్లబ్ సభ్యులు, వసతి గృహాల వార్డెన్లు, విద్యార్థులు

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకుల అలంకరణలో సాయి బాబా భక్తులకు దర్శనమిచ్చారు.

కల్యాణం... కమనీయం

రామసముద్రం, న్యూస్‌టుడే: తిరుమలరెడ్డిపల్లెలో గురువారం సీతారామలక్ష్మణుల ఊరేగింపు కార్యక్రమం కనులపండుగగా జరిగింది. సీతారాములకు కల్యాణోత్సవం నిర్వహించి సతీసమేతంగా పుష్పపల్లకిపై ఊరేగించి పూజలు చేశారు.



పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్నాయని, దీన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ట్యాంకులకు సకాలంలో క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో మస్తాన్‌వల్లి గ్రామాధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం జరిగింది. పంచాయతీ సచివాలయంలో కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించకూడదని, ప్రజారోగ్యాలను దృష్టిలో పెట్టుకుని అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణల్లో నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి పంచాయతీ సచివాలయంలో పీఆర్ రిజిస్టార్ ఖచ్చితంగా నిర్వహించాలన్నారు. దీంతోనే సచివాలయంలోని ఉద్యోగుల ప్రగతి తెలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ అబ్దుల్ షకూర్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో మస్తాన్‌వల్లి, ఈవోపీఆర్డీ అబ్దుల్‌షకూర్

సమస్యల పరిష్కారానికి చర్యలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సరిదిద్ది భూహక్కుదారులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని రీసర్వే విభాగం డీటీ రాజేశ్ పేర్కొన్నారు. గురువారం గ్రామీణ మండలం చిప్పిలి గ్రామంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూలో 528 ఎకరాల భూములకు సంబంధించి రీసర్వే జరిగిందని, ఇందులో విస్తీర్ణంలో కొంత తప్పులు, చిరునామాలు, భాగ పరిష్కారాలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. వీటిపై రెవెన్యూ దస్త్రాలు, క్షేత్రస్థాయిలో విచారించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు, భూహక్కుదారులు పాల్గొన్నారు.

26, 27న దర్గా ఉరుసు ఉత్సవాలు

మదనపల్లె గ్రామీణ: మండలంలోని శానిటోరియం గౌసే ఆజం దస్తగిరి పీరానేపీర్ 35వ ఉరుసు నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటి సభ్యులు తెలిపారు. 26న గంధోత్సవం, 27న ఉరుసు ఉంటుందన్నారు. పట్టణంలోని దక్నిపేట్ అహ్మదునిసాబీ ఇంటి నుంచి శనివారం రాత్రి గంధోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. 27న సాయంత్రం అన్నదానం, ఖవ్వాలి జరుగుతుందని, కులమతాలకు అతీతంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఉచిత బస్సు హామీ అమలెప్పుడు?

కలికిరి, న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలికిరి ఆర్టీసీ బస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకులు పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో తెదేపా, భాజపా, జనసేన కూటమి మహిళల ఓట్లతో అధికారంలోని వచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకం కింద 19-59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చినా.. ఇంత వరకు అమలు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చి 4 నెలలు 12 రోజులైనా ఇచ్చిన హామీలను మరిచిపోయిందని.. ఏ ఒక్క హామీ అమలు కావడం లేదని చెప్పారు. పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బ శ్రీకాంత్, నాయకులు శ్రీవర్ధన్, హాదిబ్, చాంద్‌బాషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు

పీలేరులో వేధిస్తున్న దుమ్ము సమస్య

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణంలో జరుగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని పీలేరు సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా ఎన్‌హెచ్ అధికారులను కోరారు. గురువారం పీలేరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆర్వోబీ పనులు జరుగుతున్నందున రోడ్డుపై దుమ్ము ఎక్కువ కావడంతో పాదచారులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో పాటు రోడ్డు పక్కన ఉన్న కుటుంబీకులు ఇళ్లలోకి దుమ్ము పడుతోందని మదనపడుతున్నారని ప్రతి ఒక్కరూ ఇళ్లకు ఎదుట ప్లాస్టిక్ కాగితాలు కట్టుకున్నారని తెలిపారు. దుమ్ముతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజల ఇబ్బందిని దృష్టితో ఉంచుకుని పనులు సత్వరం పూర్తి చేయాలని ఈ మేరకు ఎన్‌హెచ్ అధికారులను వినతిపత్రాన్ని పంపుతున్నామని సర్పంచి వివరించారు. సమావేశంలో వార్డు సభ్యులు ఫిక్కా రమణ, శ్రీనాథరెడ్డి, సాంబ, కాలేషా, విక్టరీ వెంకట్రమణారెడ్డి, నాగరాజ నాయక్, నాగభూషణం, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి హబీబ్‌బాషా, పక్కన అధికారులు

విద్యుత్తు వాహనానికి మంటలు

మదనపల్లె నేరవార్తలు : ఇంటి ఆవరణలో ఉంచిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనానికి మంటలు అంటుకుని వాహనం మొత్తం కాలిపోయిన ఘటన మదనపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగింది. కొండామారిపల్లె పంచాయతీ దేవతానగర్‌లో సుబ్రహ్మణ్యంరెడ్డి ఇంటి ఆవరణలో ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో వాహనం నుంచి మంటలు రావడంతో ఇంటి ఆవరణలో ఉన్న పలు వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పక్కనే ఉన్న సిలిండర్ పేలి ఉంటే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షలు నష్టం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

నిర్వహణలో వైఫల్యం... తాగునీరూ అందని దైన్యం

నాలుగు చోట్ల సరఫరా నిలిపివేత

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షిత జలాలను సరఫరా చేస్తున్న ప్లాంట్ల నిర్వహణలో బి.కొత్తకోట నగర పంచాయతీ విఫలమవుతోంది. పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ శుద్ధి కేంద్రాలు వివిధ కారణాల వల్ల సక్రమంగా పనిచేయకపోవడంతో స్థానికులు ప్రైవేటు ట్యాంకర్ల నుంచి క్యాన్లతో తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. ఉచితంగా తెచ్చుకుంటున్న నీటిని డబ్బు పెట్టి కొనుగోలు చేయడం సామాన్య ప్రజలకు అదనపు భారంగా మారింది. బి.కొత్తకోటలో వివిధ కారణాల వల్ల మూడు తాగునీటి ప్లాంటలో నీటి సరఫరా గత కొన్నిరోజులుగా ఆగిపోయింది. మరో ప్లాంటును ఏకంగా మూసివేశారు. పట్టణ జనాభా 30 వేలకు పైబడుతుండగా... కీలకమైన తాగునీటి సరఫరాను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● ఏపీ మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో బి.కొత్తకోటలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణ, సింహం వీధిలోని గడ్డబావి, వ్యవసాయశాఖ కార్యాలయాల వద్ద సురక్షిత తాగునీటి ప్లాంట్లను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. సేవా దృక్పథంతో అదే సంస్థ ఈ ప్లాంట్లను నిర్వహించి ప్రజలకు తాగునీరు సరఫరా చేసింది. వైకాపా అధికారం కోల్పోయిన తర్వాత ఈ ప్లాంట్ల నిర్వహణను మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ పట్టించుకోకుండా వదిలేయడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అనంతరం వీటిని స్థానిక నగర పంచాయతీ స్వాధీనం చేసుకుని నడుపుతుండగా కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.



ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పాడైన తాగునీటి ప్లాంటు



నగర పంచాయతీ కార్యాలయంలో మూతపడి ఇలా..

● స్థానిక సింహంవీధిలోని గడ్డబావి వద్ద ఉన్న నీటి ప్లాంటు సక్రమంగా పనిచేస్తున్నప్పటికీ ఇక్కడ పనిచేసే కార్మికుడు విధులకు రావడం లేదు. తనకు జీతం ఇవ్వకపోవడంతో ప్లాంటు బాధ్యతల నుంచి ఇతను తప్పుకోవడంతో సమస్య ప్రారంభమైనట్లు సమాచారం. కాగా ప్రభుత్వాసుపత్రిలో నీటిశుద్ధి ప్లాంటులో యంత్రాలు పాడైపోవడంతో సరఫరా ఆగిపోయింది. ఇదే తరహా కారణాల వల్లనే స్థానిక రంగసముద్రం రోడ్డులోని వ్యవసాయ కార్యాలయం వద్ద ప్లాంటు నుంచి నీటి సరఫరాను నిలిపి వేశారు. రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆర్థిక సహకారంతో స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్లాంటును ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాల పాటు ఇక్కడ్నుంచీ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించారు. ఈ ప్లాంటులో యంత్రాలు చెడిపోగా... వాటిని మరమ్మతులు చేయించలేకపోయారు. అందుకే ప్లాంటును ఏకంగా మూసివేశారు. దీన్ని పునః ప్రారంభించాలని స్థానికుల నుంచి అభ్యర్థనలు అందుతున్నప్పటికీ అధికారుల నుంచి స్పందన కరవైంది. కాగా ప్రస్తుతం స్థానిక బీసీ కాలనీలో సొంతంగా నగర పంచాయతీ నడుపుతున్న ప్లాంటు ద్వారా సురక్షిత నీరు ప్రజలకు అందుతోంది. తాకాటంవారిపల్లెలోని తాగునీటి ప్లాంటు ద్వారా నీటి సరఫరా కొనసాగుతోంది. సురక్షిత తాగునీటి ప్లాంట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని నగర పంచాయతీ ఏఈ రాజేంద్ర తెలిపారు. గురువారం 'న్యూస్‌టుడే'తో ఆయన మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో తాగునీటి ప్లాంట్లలో పాడైపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. పట్టణంలోని తాగునీటి ప్లాంట్ల వద్ద కార్మికులు విధులు నిర్వర్తించేలా చూస్తామని, నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

అన్నమయ్య జిల్లా (పూర్వపు చిత్తూరు జిల్లా), పీలేరు మండలం, ముదుపులవేముల గ్రామం, వెంకటాద్రి ఇండ్లులో కాపురముండు నా కక్షిదారులైన 1. లేట్ సి.చెంగల్రాయుడు భార్య సి.అలివేలమ్మ, కుమారులైన 2. సి.నాగార్జున మరియు 3. సి.నాగేంద్రబాబుల తరపున యావన్మందికీ తెలియజేయడం ఏమనగా :

క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తి నా కక్షిదారులు మరియు అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, ముదుపులవేముల గ్రామం, వెంకటాద్రి ఇండ్లులో కాపురముండు 1. సి.రమణ, తండ్రి లేట్ సి. చిన్ననాగులు మరియు 2. ఎం.లలిత, భర్త రమణ, తండ్రి సి.చిన్ననాగులు, తిరుపతి జిల్లా & పట్టణం, శివజ్యోతి నగర్, డోర్ నెం : 20-3-35/2లో కాపురముండు 3. సి.గౌరి, భర్త లేట్ సి.మణి, 4. సి.కీర్తి, తండ్రి లేట్ సి.మణి, 5. సి.స్వాతి, తండ్రి లేట్ సి.మణి, 6.సి.శివశంకర నారాయణ, తండ్రి లేట్ సి.మణి, 7. సి.సాయి శంకరనారాయణ (మైనర్), తండ్రి లేట్ సి.మణిలకు వారసత్వరీత్యా సంక్రమించి, అందరి ఉమ్మడి స్వాధీన అనుభవములో కలదు. షెడ్యూల్ దాఖలా ఆస్తిలో నా కక్షిదారులకు రావలసిన 1/4 భాగమును భాగపరిష్కారం కోరగా పై కనిన వారు నా కక్షిదారులకు కాలహరణం చేయుచుండగా, నా కక్షిదారులు వారికి రావలసిన 1/4 భాగము కొరకు పై కనిన వారిని ప్రతివాదులుగా చూపుతూ, పీలేరు సర్వశ్రీ ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు నందు దావా నెం. 30/2022ను దాఖలు చేసినారు. ఇలా ఉండగా పై కనిన ప్రతివాదులు షెడ్యూల్ దాఖలా ఆస్తిని తప్పుడు సంగతులతో మభ్యపెట్టి ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నిస్తున్నారని తెలిసినది. కావున ఎవరైనా, పై కనిన వారి వద్ద నుండి క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎటువంటి క్రయ, విక్రయములు జరిపినా అవి ఏంతమాత్రమూ చెల్లనేరవనియూ మరియు నా కక్షిదారుల హక్కుకు ఎలాంటి భంగం కలగదనియూ, అట్లు ఎవరైనా కొనుగోలు చేసినా, క్రయ, విక్రయాలు జరిపినా ఆఖ్దీవారిపై నా కక్షిదారులు తీసుకొనబోవు సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులగుదురని యావన్మందికీ తెలియజేయడమైనది.

షెడ్యూల్ : Annamaiah District, Piler Sub- District, Piler Mandal, Mudupulavemula Revenue Village, the property situate in 1. S.No. 793 to an extent of Ac 3.61 cents and 2. S.No. 1157/20 to an extent of Ac 4.06 cents, 3. S.No. 1190/6 to an extent of Ac 1.09 cents.

ఇట్లు : శ్రీ జి. ఈశ్వర్‌రెడ్డి, న్యాయవాది, పీలేరు

రాయచోటి ఆర్డీవోగా శ్రీనివాస్

రాయచోటి, న్యూస్‌టుడే : రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్డీవో) ఎ.శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రంగస్వామిని పోస్టింగ్ కోసం ప్రభుత్వ కార్యదర్శి వద్ద రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పశుగణనకు సహకరించండి

చిన్నమండెం, న్యూస్‌టుడే : రాయచోటి డివిజన్‌లోని పశువుల పెంపకందారులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే పశుగణనకు సహకరించాలని పశుసంవర్ధక శాఖ రాయచోటి డివిజన్ డీడీ మాలకొండయ్య కోరారు. చిన్నమండెం మండలంలోని చిన్నర్సుపల్లిలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పశువులకు వచ్చే కాలానుగుణ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డిసెంబరు 1 నుంచి పిల్లి తరక వ్యాధి నివారణకు టీకాలు వేస్తామన్నారు. పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిటుక వ్యాధి, బొబ్బలరోగం, నీలినాలుక వ్యాధి జీవాలకు సోకే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉంటూ సకాలంలో వైద్యం చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి డివిజన్ టెక్నికల్ వైద్యుడు రవికుమార్, పశువైద్యుడు గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన క్షత్రియ సమాఖ్య నాయకులు



సీఎం చంద్రబాబుతో తెదేపా నాయకుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబును క్షత్రియ ఫెడరేషన్ నాయకులు గురువారం అమరావతిలోని సచివాలయంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని, అన్నమయ్య ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని సీఎంను కోరినట్లు తెదేపా రాజంపేట నాయకుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని, సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్షత్రియ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ భూముల ఆక్రమణపై విచారణ

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేటలోని వీరచౌడేశ్వరీదేవి ఆలయానికి సంబంధించి అన్యాక్రాంతమైన భూముల విషయంలో చర్యలు తీసుకుంటామని దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు. వీరచౌడేశ్వరీదేవి ఆలయానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతమైనట్లు ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు గురువారం ఆలయ దస్త్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయం దేవాదాయశాఖలో రిజిస్టర్ అయిందన్నారు. ఆలయ నిర్వహణకు సంబంధించిన దస్త్రాలు సక్రమంగా లేవన్నారు. ఆలయానికి సంబంధించిన బంగారం, వెండి ఆభరణాల లెక్కలు కూడా సక్రమంగా లేవన్నారు. వీటిని సరిచేసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించామన్నారు. రాజంపేట మండలం మదనగోపాలపురంలోని ఆలయానికి సంబంధించి ఉన్న 27 సెంట్ల భూమి ఆక్రమణలో ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. రాజంపేట ఆలయ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యాంత్రీకరణ భాగ్యం!

- రాయితీపై పరికరాలివ్వాలని నిర్ణయం
- వ్యవసాయశాఖాధికారుల ప్రతిపాదన
- ఎన్డీయే సర్కారుపై చిగురించిన ఆశలు

-న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం

వ్యవసాయ రంగంలో కూలీల కొరత వెంటాడుతోంది. దీంతో వ్యవసాయ పరికరాల వినియోగం అనివార్యమైంది. గత వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో మధ్యవర్తులకు పెద్దపీట వేశారు. నచ్చినోళ్లకే యంత్ర పరికరాలు మంజూరు చేశారు. సన్న, చిన్నకారు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపారు. కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా నిరీక్షణే మిగిలింది. కర్షకుల కన్నీటి వెతలను జగన్‌రెడ్డి జమానాలో ఎవరూ ఆలకించలేదు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నదాతకు వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలివ్వాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనపై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఏఏ రకాలు కావాలో సమాచారం సేకరించి నివేదించాలని ఇటీవలే ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

జిల్లాలో రైతుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో 17 రకాల 12,423 యంత్ర పరికరాలు రాయితీపై ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వీటిని ఉమ్మడి సంఘాలు, బృంద సభ్యులు, వ్యక్తిగతంగా మంజూరు చేయాలని కసరత్తు చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతుల కన్నీటి ఘోషను చెవికెక్కించుకోలేదు. కర్షకులు పలుమార్లు మొరపెట్టుకున్నా ఎలాంటి ఫలితం లేదు. నేలలో లోతు దుక్కులు, విత్తనం, ఎరువులు చల్లడానికి అనువైన గొర్రులు, శరవేగంగా సేద్యం పనులు చేయడానికి కావాల్సిన ట్రాక్టర్లు మంజూరు చేయాలని వేడుకున్నా ఆలకించలేదు. తాళి రెండేళ్లు రిక్త హస్తం చూపారు. చివర్లో రైతు భరోసా కేంద్రాల్లో యంత్రపరికరాలను అందుబాటులో పెట్టి తక్కువ ధరలకే ఇవ్వాలని వినియోగదారుల అద్దె కేంద్రాలను ఏర్పాటు చేయించారు. సాగుదారు వినియోగదారుల సంఘాల పేరిట వైకాపా విధేయులకు పందేరం చేశారు. సాధారణ రైతులకు మాత్రం నిరాశ తప్పలేదు.

★ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అధికార పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో మునుపటిలా రైతులకు యంత్ర భాగ్యం కల్పించాలని ముందుకొచ్చారు. ప్రాధాన్య క్రమంలో ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు అందజేయాలని ఉన్నత స్థాయిలో కసరత్తు చేస్తున్నారు. భూమిలో విత్తనం వేసిన అనంతరం చిరు మొలక నుంచి కోత వరకు తెగుళ్లు విజృంభిస్తున్నాయి. పురుగులు దాడి చేస్తున్నాయి. అన్నదాతల ఆశల పంటను నమిలి మింగేస్తున్నాయి.



బహుళ పంటల నూర్పిడి యంత్రాలు

చీడల అదుపు చేయడంలో కీలకమైన చేతి, కాలితో తొక్కేవి, బ్యాటరీ, పవర్, తైవాన్ కాడి స్ప్రేయర్లను ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది.

★ నేలను గుల్ల చేయడానికి వినియోగించే రోటావేటర్లు ఇవ్వనున్నారు. దుక్కి పనులకు కావాల్సిన 5, 7, 9 మడకల గొర్రులు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. త్వరలో ఉన్నత స్థాయి నుంచి మార్గదర్శకాలు రాగానే మంజూరు చేయాలని నిర్ణయించారు. వరి కోత, బహుళ పంటల నూర్పిడి యంత్రాలు, చిన్న ట్రాక్టర్లు, గడ్డిని కట్టలు కట్టడానికి, గ్రాసం కత్తిరింపులు, రోటావేటర్లు, కలుపుతీత పరికరాలు రాయితీపై ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. త్వరలో అనుమతి రానున్నట్లు వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. అయిదేళ్ల అనంతరం వ్యక్తిగతంగా రాయితీపై అధునాతన యంత్ర పరికరాలు రానున్నాయని తెలుసుకుని కర్షకుల మోము మురిసిపోతోంది. కూలీల కొరత సమస్యకు పరిష్కారం లభిస్తుందని, సేద్యం పనులు శరవేగంగా ముందుకు సాగుతాయని ఆశాభావంతో ఉన్నారు.

జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనలు

రకం	యంత్ర పరికరాలు
వరిగడ్డి కట్టలు కట్టడానికి	28
వేరుసెనగ కాయల తీత	50
కోనోవీడర్లు	75
డ్రమ్ సీడర్లు	100
బహుళ పంటల నూర్పిడి	150
ట్రాక్టరు స్ప్రేయర్లు	240
చాఫ్ కట్టర్లు	350
ట్రాక్టర్లు	400
చిన్న ట్రాక్టర్లు	450
పవర్ టిల్లర్లు	480
ఎరువులు జల్లే గొర్రు	650
పవర్ వీడర్లు	750
రోటావేటర్లు	1,200
5, 7 మడకల గొర్రులు	1,500
9 మడకల గొర్రులు	1,500
చేతి, బ్యాటరీ స్ప్రేయర్లు	2,000
తైవాన్, పవర్ స్ప్రేయర్లు	2,500

అనుమతి రాగానే మంజూరు చేస్తాం

జిల్లాలో వ్యవసాయం చేస్తున్న రైతులకు కావాల్సిన 17 రకాల యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉన్నత స్థాయి నుంచి అనుమతి రాగానే ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన కర్షకులకు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- చంద్రానాయక్, డీఏవో

స్వర్ణాంధ్ర లక్ష్యాలు సాధించేందుకు కృషి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లాకు సంబంధించి స్వర్ణాంధ్ర-2047లోని లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టరు చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ నిర్వహించిన సమీక్ష సమావేశానికి జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌తో కలిసి ఆయన కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. జిల్లాలో పర్యాటక, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్యఆరోగ్య అభివృద్ధి రంగాలలో మంచి అవకాశాలున్నాయని పేర్కొన్నారు. నిర్దిష్ట వ్యవధిలో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణరావు, సీపీవో వెంకట్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీరందక... దాహం కేక



బోరు వద్ద తాగునీటి కోసం ఎదురు చూస్తున్న మహిళలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చిన్నంపల్లె అరుంధతివాడలో వారం రోజులుగా నీటి సమస్య నెలకొంది. గ్రామంలోని మోటారు మరమ్మతులకు గురవడంతో నీటి సమస్య నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బోరు నుంచి నీరు తక్కువగా వస్తుండటంతో కొన్ని నెలలుగా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కొత్త బోరు వేసినా మోటారు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో నీరు అందడం లేదన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మల్‌రెడ్డిని వివరణ కోరగా.. గ్రామంలో నీటి సమస్య ఉండటంతో కొత్త బోరు వేశామన్నారు. ఉన్న మోటారు కాలిపోయిన విషయం ప్రజలు తమ దృష్టికి తీసుకురాలేదన్నారు. మోటారుకు మరమ్మతులు చేసి కొత్త బోరుకు మోటారును ఏర్పాటు చేస్తామన్నారు. నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : ఆధార్‌కార్డుల్లో తప్పుల సవరణకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డి సూచించారు. గురువారం సచివాలయంలోని ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. విడతల వారీగా ప్రతి సచివాలయంలో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

శుద్ధిజలంతోనే ఆరోగ్యం

రాయచోటి, న్యూస్‌టుడే : శుద్ధిజలంతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు కొండయ్య పేర్కొన్నారు. పట్టణంలోని కె.రామాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన నీటి నాణ్యత పరీక్షల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితమవుతోందన్నారు. దీంతో టైఫాయిడ్, డయేరియా, డిసెంట్రీ, కామెర్లు తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటి కట్టడికి శుద్ధిజలం అందించడం ఎంతో అవసరమన్నారు. గ్రామాలు, పట్టణాలకు సరఫరా అవుతున్న నీటి పథకాల నుంచి నమూనాలు సేకరించి వైద్య ఆరోగ్య సిబ్బంది పరీక్షించాలని పేర్కొన్నారు. నీటి పరీక్షలు నిర్వహించేటప్పుడు సిబ్బంది ఏయే రసాయనాలు ఎంత మోతాదులో కలపాలి, పరీక్ష అనంతరం ఫలితాన్ని ఎలా విశ్లేషించాలని తదితర అంశాలను వివరించారు. నీటి నాణ్యత ఫలితాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 375 మంది సీహెచ్‌వోలకు డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ శిక్షణ ఇచ్చారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె మండల పరిధి దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రోగులకు సకాలంలో చికిత్స అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పలు దస్త్రాలు పరిశీలించారు. వైద్యులు సమయపాలన పాటించి రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వచ్చే కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు సిద్దయ్య, సుమలత, నజియా, రిజ్వాన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, ఎంపీహెచ్‌ఈవో దేవదానం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి డిమాండు



మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు

చిన్నమండెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని చాకిబండ దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలు వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటుండటంతో అక్కడికే వెళ్లి వారితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు స్పందించి బోరు బావి తవ్వించి నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. నాయకులు రమణ, రామాంజి, భరత్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ ఈ నెల 26, 27 తేదీల్లో రాయచోటిలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు కోరారు. గురువారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగబసిరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.రవికుమార్, పక్కన నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే : రాయచోటిలో ఈ నెల 27న నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకుడు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. రాజంపేటలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ హాజరవుతారన్నారు. కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలే ఎజెండాగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుజాతమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

అనాథలను దత్తత తీసుకోండి

రామాపురం, న్యూస్‌టుడే : తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా శిశు గృహ మేనేజరు సుప్రియ సూచించారు. గురువారం వెలుగు కార్యాలయంలో జిల్లా శిశు గృహ ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో అనాథ పిల్లల సంరక్షణ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు లేని పిల్లలను దత్తత తీసుకుని కుటుంబ విలువలు తెలియజేయాలన్నారు. ఏపీఎం దేవసేన, గాయత్రి డ్వాక్రా సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీ

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : యువత చెడు వ్యసనాల బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మన్నూరు సీఐ రామాంజనేయులు సూచించారు. రాజంపేట మండలం బోయనపల్లిలోని విద్యార్థుల వసతిగృహాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. గంజాయి తదితర మత్తుపదార్థాలు వినియోగిస్తే కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఉచిత బస్సు ప్రయాణం అమలుకు నిరసన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు గోశాల దేవి డిమాండు చేశారు. ఈ మేరకు మహిళలతో కలిసి గురువారం కొత్త బస్టాండు వద్ద నిరసన తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించిందని గుర్తు చేశారు. అందులో పింఛన్ల పెంపు మినహా మిగిలిన హామీలు అమలు చేయలేదన్నారు. సీనియర్ నాయకుడు శాంతయ్య, మహిళా కార్యకర్తలు ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మమ్మ, భద్రావతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ డిమాండు చేశారు. హామీలు అమలు చేయాలని కోరుతూ... గురువారం రాయచోటిలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలంటూ బస్సుల్లోని మహిళలకు పోస్టుకార్డులు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. .. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు మన్సూర్ అలీఖాన్, అల్లాబకాష్, అమీర్, దర్బార్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్, రాజంపేట ఎంవీఐ వినోద్, సీఐ హేమసుందరరావు సూచించారు. మండల పరిధిలోని రాజానగర్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని ఎన్‌హెచ్‌ఏఐ అధికారి మనోజ్ కలిసి పరిశీలించారు. ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు, వేగ నిరోధకాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు

నందలూరు, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో నందలూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అండర్-14, 17 విభాగం క్యారమ్స్ పోటీల్లో తేజకృష్ణ, పెంచలయ్య, నరసింహ, స్వర్ణలత, వెంకటస్నేహ, మల్లికార్జున, మాలాశ్రీ, అండర్-14 ఖోఖో పోటీలలో ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన నాగచైతన్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

పుల్లంపేట, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు రుత్విక్‌రామ్ ఎంపికైనట్లు తల్లిదండ్రులు మాధవమూర్తి, హేమలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉమ్మడి కడప జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగంలో జరిగిన చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచాడన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రుత్విక్ ఎంపికపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

తోడుదొంగలు

కొలిక్కివచ్చిన కాల్పుల ఘటన కేసు
పోలీసుల అదుపులో 12 మంది

ధర్మవరం, బత్తలపల్లి, న్యూస్‌టుడే: గుప్తనిధుల తవ్వకాల్లో బంగారం దొరికిందని, రెండు కిలోలు రూ.ఐదు లక్షలకే ఇస్తామని ఒక ముఠా మరో ముఠాకు ఎరవేసింది. పరస్పరం మోసగించేందుకు రెండు ముఠాలు తోడుదొంగలుగా మారి.. చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద ఈనెల 20న తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. అన్నమయ్య జిల్లా షికారీపాలెంకు చెందిన కొందరు నకిలీ బంగారం ఎరవేసి డబ్బు కాజేసే ముఠాగా పోలీసుల రికార్డుల్లో ఉన్నారు. గుప్తనిధుల తవ్వకాల్లో రెండు కిలోల బంగారం దొరికింది. తక్కువ ధరకే ఇస్తామని హైదరాబాద్‌కు చెందిన నరేష్ అనేవ్యక్తికి ఎరవేశారు. ఇందులో షికారీపాలెం ముఠాకు చెందిన రాణాహర్ కీలకంగా వ్యవహరించాడు. ఇత్తడికి బంగారు పూత వేయించి బంగారాన్ని పరీక్షించుకోవాలని నరేష్‌కు ఎరవేశాడు. షికారీపాలెం ముఠా చూపించిన ఇత్తడిపూత కడ్డీని పరీక్ష చేయించగా బంగారంగానే భావించారు. రూ.5 లక్షలకు 2 కిలోల బంగారం ఇచ్చేందుకు ముఠా అంగీకరించిందని నరేష్ హైదరాబాద్‌కు చెందిన అరవింద్ నాగరాజు, రితీష్‌లకు చెప్పాడు. యూట్యూబర్ అయిన అరవింద్ సైబర్ పోలీసులతో సన్నిహితంగా మెలిగేవాడు. రెండు కిలోల బంగారాన్ని రూ.5 లక్షలు డబ్బు ఇవ్వకుండా కాజేయాలని నరేష్‌తో కలిసి పథకం వేశాడు. షికారీపాలెం నుంచి తాము ద్విచక్ర వాహనాల్లో వస్తున్నామని, బంగారం తెస్తున్నామని, బత్తలపల్లి మండలం రామాపురం వద్దకు రావాలని షికారీపాలెం ముఠా హైదరాబాద్‌కు చెందిన నరేష్‌కు ఫోన్‌లో తెలిపారు. డబ్బు తీసుకొస్తున్నానని, ఒక కారులో నరేష్‌తో పాటు మరికొందరు రాగా మరో కారులో అరవింద్, నాగరాజు, రితీష్ మరికొందరు వచ్చారు. రామాపురం బస్టాప్ వద్ద నకిలీ బంగారం నరేష్‌కు షికారీపాలెం ముఠా ఇచ్చే సమయంలో ఇంకో కారులో వచ్చిన అరవింద్ బృందం సఫారీ దుస్తులు ధరించి ఎయిర్ పిస్టల్‌తో గాల్లో కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు వచ్చారని షికారీపాలెం ముఠా నకిలీ బంగారం కడ్డీలను అక్కడే వదిలి పరారయ్యారు. బత్తలపల్లి పోలీసులకు మొదట షికారీపాలెం ముఠాకు చెందిన బంగారీ అనే యువకుడు పట్టుబడ్డాడు. రెండు ముఠాలకు చెందిన 12 మందిని అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



మహిళలకు మగ్గం వర్క్ కిట్లు అందజేస్తున్న కెనరా బ్యాంక్ మేనేజరు నందిని

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : మహిళలు ఆర్థికంగా రాణించాలని కెనరా బ్యాంకు బ్రాంచి మేనేజరు నందిని సూచించారు. పట్టణంలోని గ్లోబల్ సర్వీసు ట్రస్టు కార్యాలయంలో గురువారం మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కిట్లు పంపిణీ చేశారు. కడపకు చెందిన కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఈ అంశాలపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు పార్థసారధి పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వసుంధర, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి, విద్యార్థులు

వీరబల్లి, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం వీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ ఛైర్మన్ సురేంద్రారెడ్డి, సిబ్బంది నాగయ్య, శ్రీనివాసులు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జనసేన నాయకుడు



ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును సత్కరిస్తున్న శివప్రసాద్

రాజంపేట, న్యూస్‌టుడే : జనసేన పార్టీ రాయలసీమ జోన్ ఎన్నికల కన్వీనర్ చెంగారి శివప్రసాద్ గురువారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడును రాయచోటిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ మేరకు రాజంపేట ప్రాంతంలోని పలు పరిస్థితులు, ప్రజా సమస్యలను ఆయనకు విన్నవించినట్లు శివప్రసాద్ తెలిపారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు


బాణసంచా దుకాణదారులకు సూచనలిస్తున్న తహసీల్దారు అరవింద కిశోర్

పుల్లంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ నిబంధనల మేర బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దారు అరవింద్ కిశోర్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో బాణసంచా దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు అతిక్రమిస్తే అనుమతులు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్.ఐ భక్తవత్సలం

రాయచోటి, న్యూస్‌టుడే : విద్యార్థులు చిన్ననాటి నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై భక్తవత్సలం పేర్కొన్నారు. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చరవాణులకు వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

రామాపురం, న్యూస్‌టుడే : నీలకంఠరావుపేటలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కడపకు చెందిన కింగ్ ఆసుపత్రి వైద్యులు రుబీనా, హాజీర తెలిపారు. మసీదు సమీపంలో మండల మైనార్టీ నాయకుడు అయూబ్ ఖాన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలు గ్రామాల నుంచి వచ్చిన 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

పింఛలోకి 220 క్యూసెక్కుల ప్రవాహం

సుండుపల్లి, న్యూస్‌టుడే : వై.ఎస్.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలోకి గురువారం 220 క్యూసెక్కుల నీరు చేరిందని ఏఈ నాగేంద్రనాయక్ తెలిపారు. గురువారం సాయంత్రానికి జలాశయంలో 985.2 అడుగుల మేర నీటిమట్టం ఉందన్నారు.

తాగునీరు కలుషితం... వ్యాధులతో సతమతం!


అపరిశుభ్రంగా ఉపరితల ట్యాంకు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే

గ్రామస్థులకు రక్షిత నీరు సరఫరా చేసే పథకాల నిర్వహణ సజావుగా సాగడం లేదు. నిత్యం అల్లమండిడికి ఈ పథకాల ద్వారానే నీటి సరఫరా జరుగుతుంది. వీటి నిర్వహణలో గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. జలవల కలిసిన భారీ వర్షాలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలం మొత్తం 320 చేతి పంపులు ఉండగా 32 ఉపరితల ట్యాంకులున్నాయి.

మొక్కుబడిగా సాగుతోంది

గ్రామ పంచాయతీల్లో తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ మొక్కుబడిగా సాగుతోంది. ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరగడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ట్యాంకుల వద్ద రోజుల తరబడి నీరు నిల్వ ఉండటం, పక్కనే మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సూచనలతో బ్లీచింగ్ చల్లకపోవడం, పలుచోట్ల ట్యాంకులు ఎక్కేందుకు మెట్ల మార్గం సరిగ్గా లేకపోవడం, తదితర సమస్యలున్నాయి. వ్యాధులు సక్రమించే వర్షాకాలంలోనూ ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు.

నమూనాలు సేకరిస్తున్నాం

రక్షిత మంచినీటి పథకాల వద్ద నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపిస్తున్నాం. క్లోరినేషన్ తదితర వివరాలు పంచాయతీ గోడలపై నమోదు చేయాల్సిన బాధ్యత ఆయా పంచాయతీలపైనే ఉంది. దీనికి మండల పరిషత్ అభివృద్ధి అధికారితో పాటు సిబ్బందితో కలిసి పనులు చేయిస్తున్నాం.

-కిశోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ, లక్కిరెడ్డిపల్లె

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM) రాజంపేట : 9441872651 రాయచోటి : 9703622242 రైల్వేకోడూరు : 7981695235

స్పందనకు వందనం

సుండుపల్లి, న్యూస్‌టుడే : బాలాజీ నగర్ మలుపులో పేరుకుపోయిన చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ సమస్యపై నాలుగు రోజుల కిందట మేమున్నాం మీకుతోడుగాలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించారు.

?: బాహుదా నది నుంచి తాగునీటి సరఫరా చేస్తున్న మోటారు కాలిపోయింది. దీంతో నాలుగు రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. - సుధాకర్, సుండుపల్లి

✓: మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరిస్తాం. - సురేష్‌బాబు, ప్రత్యేక అధికారి, సుండుపల్లి -న్యూస్‌టుడే,సుండుపల్లి

సృజనకు పదును


పరీక్షకు హాజరైన విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ చెంగల్రాజు, ఉపాధ్యాయులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఆదర్శ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు', విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రెడ్డివర్షిత, సహనాశ్రీ, స్పందన విజేతలుగా నిలిచారు. కరస్పాండెంట్ చెంగల్రాజు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శోభనబాబు, పీఈటీ నరసింహ పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు అనంత్‌రెడ్డి

రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే : రాయచోటి పట్టణంలోని భారతీ విద్యా మందిర్ పాఠశాలలో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభనష్టాలు', విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హమీద్ బాషా (10వ తరగతి), దీపిక (9వ తరగతి), ఇక్రా (8వ తరగతి) విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు అనంత్‌రెడ్డి విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు

భూముల రీసర్వే సమస్యల పరిష్కారానికే సదస్సులు


అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు

సుండుపల్లి, న్యూస్‌టుడే : భూ రీసర్వేలో ఎదురైన అభ్యంతరాలలో పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దారు దైవాదీనం తెలిపారు. సమస్యలున్న రైతులు వినతులు ఇవ్వొచ్చని సూచించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. గురువారం అక్కంపల్లిలో జరిగిన సమావేశంలో భూ సమస్యలపై ఏడుగురు, మ్యుటేషన్ కోసం ఇద్దరు, కొలతల కోసం అయిదుగురు వినతిపత్రాలు ఇచ్చారని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసులునాయక్, సర్వేయరు వెంకటసుబ్బయ్య, భాజపా అసెంబ్లీ కన్వీనరు రామజగదీష్‌స్వామి, తెదేపా నాయకుడు శివరాంనాయుడు, వీఆర్వో విజయలక్ష్మి, సర్వేయర్ కీర్తన పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజనేయులు

రామాపురం, న్యూస్‌టుడే : గ్రామాల్లో ఇటీవల జరిగిన రీసర్వేతో ఏర్పడిన సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం గువ్వలచెరువులోని సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. గువ్వలచెరువులో 857.13 ఎకరాలు రీ సర్వే చేశామన్నారు. రైతులకు భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీటీ కృపావతి, శివయ్య, ఆజాం బాషా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, పక్కన ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్

సుండుపల్లి, న్యూస్‌టుడే : ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు పేర్కొన్నారు. సుండుపల్లిలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఝరికోన జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నా కాలువల నిర్మాణంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పింఛ జలాశయ పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రోళ్లమడుగు మంచి నీటి పథకానికి అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సుండుపల్లి-రాయచోటి రెండు వరుసల రహదారి నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందని, పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలకు వెనకాడబోమన్నారు. ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథనాయక్ మాట్లాడుతూ.. అక్కంపల్లి గిరిజన కాలనీకి నీరు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుని తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా శివాజీని నియమించామని వెల్లడించారు.

భూవివాదంలో ఒకరికి గాయాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే : మండల పరిధి దిగువగొట్టివీడులోని రామాపురంలో భూ సమస్యపై గురువారం జరిగిన గొడవలో గ్రామానికి చెందిన మోడెం నాగరాజు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రామాపురానికి చెందిన నాగరాజు, ఆంజనేయులు మధ్య కొన్ని రోజులుగా భూ తగాదా నడుస్తోంది. బుధవారం ఈ విషయమై ఇద్దరూ గొడవ పడ్డారు. గొడవలో నాగరాజు గాయపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే : తాళం వేసిన ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బంగారం, నగదుతో పరారైన సంఘటన మండల పరిధిలోని రాఘవరాజుపురంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పార్థసారధి అనే వ్యక్తి జాతీయ రహదారి పక్కన ఇంట్లో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనిపై కమలాపురానికి వెళ్లి బుధవారం రాత్రి ఇంటికి వచ్చే సరికి దుండగులు తాళం పగలగొట్టి బీరువాలోని 30 గ్రాముల బంగారం, రూ.38 వేల నగదుతో పరారయ్యారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : రాజంపేట మండలం వెంకటరాజంపేటకు చెందిన యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


వెంకయ్యస్వామి ఆలయం వద్ద చెత్తను తొలగింపజేస్తున్న బత్యాల

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయం వద్ద గురువారం ఆయన చెత్తాచెదారాన్ని జేసీబీ వాహనాలతో తొలగింపజేశారు. కోడూరు నుంచి గుర్రప్ప పాలెం కాలనీకి వెళ్లే దారిలో పంచాయతీ కార్మికులు చెత్తను డంపింగ్ చేయడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. ఇటీవల వర్షాలకు చెత్త సేకరణ ఆటోలు డంపింగ్ స్థలంలోకి వెళ్లలేకపోవడంతో కొద్దిరోజులుగా అక్కడ చెత్త దించాల్సి వస్తోందని సర్పంచి బుడిగి శివయ్య తెలిపారు. పంచాయతీ అధికారులు ఆలస్యం చేస్తుండడంతో గ్రామస్థుల సమస్యను బత్యాల దృష్టికి తీసుకెళ్లగా ఆయన పరిష్కరించారు.